క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలంలోని నరగాయపాలెంలోని లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి తిరునాళ్ల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

ముండ్రువారిపాలెం ఇన్‌చార్జి సర్పంచిగా విజయలక్ష్మి




శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం పంచాయతీ ఇన్‌చార్జి సర్పంచిగా పాపసాని విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీడీఓ పి.సీతారామయ్య శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం సర్పంచి చింతా పేరయ్య వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలంగా సెలవుపై వెళ్ళటంతో ఉపసర్పంచిగా ఉన్న విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు.

ఘనంగా ఈదమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: స్థానిక ఈదమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుకట్ట సెంటర్లో ఉన్న ఈ ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భజనా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన నిర్వహించారు.

బీసీల ఆత్మబంధువు సీఎం వైఎస్ జగన్



చిలకలూరిపేట టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తు, బీసీల ఆత్మబంధువుగా నిలిచారని పలువురు బీసీ నాయకులు కొనియాడారు. ఇటీవల కొమరవల్లిపాడు సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొండవీటి ఆంజనేయులును శుక్రవారం పలువురు బీసీ నాయకులు కలసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ బీసీ నాయకులకు పదువులు రావటానికి కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఉప్పాల భాస్కర రావు, గుంజి పద్మావతి, ఉండవల్లి కోటేశ్వరరావు ఉన్నారు.

బ్రహ్మంగారి కల్యాణోత్సవాలు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెంలోని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణ వేడుకలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వర కల్యాణం. అలాగే గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణాలను వైభవోపేతంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కనగాల వసంతాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కల్యాణ వేడుకల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రారంభమైన జిల్లా స్థాయి తాళం భజన పోటీలు

సత్తెనపల్లి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 84వ ఆరాధనోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో శుక్రవారం జిల్లా స్థాయి తాళం భజన పోటీలను ఆశ్రమ మాతాదిపతులు లలితాంబ మాతాజీ ప్రారంభించారు. ఆశ్రమ వ్యవస్థాపక ధర్మకర్త స్వప్రకాష్ గురూజీ ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ నిర్వహించారు. తొలి రోజు పోటీల్లో తొమ్మిది సమాజాలు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న సమాజములకు పారి తోషికం, జ్ఞాపికలను ఆశ్రమ నిర్వాహకులు చింతాడ గిరినాథ్ శర్మ, సూర్యప్రకాష్, కమలాదేవి, ఉమాదేవి, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ ప్రత్యూష, తదితరులు అందించారు. శనివారం కూడా పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 30న బ్రహ్మంగారి ఆరాధన, అన్నసంతర్పణ ఉంటాయని, పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

సేఫ్ ఫార్మాస్యూటికల్‌తో సంబంధం లేదు

- ఆ కంపెనీ నిర్వహిస్తున్న వ్యక్తులెవరో తెలియదు
- టీడీపీ నాయకుల ఆరోపణలు అర్థరహితం
- ఆధారాలతో సహా నిరూపించాలి
- టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే గోపిరెడ్డి సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: సత్తెనపల్లి నియోజకవర్గంలోని గోళ్లపాడు గ్రామ పరిధిలోని సేఫ్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో తయారై పట్టుబడిన ట్రమడాల్ మందుల వ్యవహారంలో తనకు గాని, వైఎస్సార్ సీపీకి గాని ఎటువంటి సంబంధం లేదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దీనిపై నరసరావుపేటను ముడిపెడుతూ టీడీపీ నాయకుడు అరవిందబాబు చేసే ఆరోపణలు రాజకీయమైనవని, అర్థంలేని చిల్లర ఆరోపణలు అన్నారు. శుక్రవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వ్యవహారాన్ని తనకు అంటగడుతూ అరవిందబాబు చేసిన ఆరోపణలు తన ఉనికిని కాపాడుకునేందుకు చేసినవే అన్నారు. మానవుల ప్రాణాలకు హాని కలిగించే మందులు తయారుచేసే యటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. మందుల తయారీ అనేది కేంద్ర ప్రభుత్వ అనుమతితో తయారు చేస్తారన్నారు. తనపై ఆరోపణలు చేసి రాజకీయంగా ప్రచారం పొంది వచ్చే ఎన్నికల్లో సీటు దక్కించుకోవాలనే ఆలోచనలతోనే తనపై ఆరోపణలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. మందులు తయారు చేసిన కంపెనీ సత్తెనపల్లి నియోజకవర్గంలో ఉందని, దివంగత మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుకు చెందినదని పేర్కొన్నారు. 2019 ఎన్నికల అనంతరం వారి వద్ద నుంచి వేరే వ్యక్తులు కొనుగోలు చేశారన్నారు. దీనిలో నిర్వహించే వ్యాపారానికి నరసరావుపేటకు సంబంధమేమిటని ప్రశ్నించారు. దీనిని నిర్వహిస్తున్న శనగల శ్రీధర్‌రెడ్డి తెలంగాణకు చెందిన వ్యక్తి కాగా, తాటిపర్తి గోవిందరెడ్డి అమెరికాలో ఉంటున్నాడని పేర్కొన్నారు. వారిద్దరినీ తానిప్పటివరకు చూసి ఎరుగనన్నారు. పేరు పక్కన రెడ్డి అనే రెండు అక్షరాలు ఉన్న వారందరూ వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులే అనుకోవటం టీడీపీ వారి అలవాటుగా మారిందని చెప్పారు.

పేషెంట్లను మోసం చేస్తున్న అరవిందబాబు

ఒక డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తూ పేషెంట్లను అరవింద బాబు ఘోరంగా మోసం చేస్తున్నాడని ఎమ్మెల్యే గోపిరెడ్డి ఆరోపించారు. అతను నిర్వహించే హాస్పిటల్‌లో తనకోసమే విండాల్, రేనాల్డ్ అనే పనికిరాని ఆయింట్‌మెంట్లు తయారు చేయించి పేషెంట్లకు అంటగడుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇవి మరెక్కడా కన్పించవన్నారు. అతను చేసే ఆపరేషన్లు పూర్తిగా మోసమైనవి అన్నారు. సత్తెనపల్లి కట్టమూరు గ్రామానికి చెందిన ముడిగొండ్ల అశోక్(26) కాలు విరిగి ఆరోగ్యశ్రీ కింద అతడి హాస్పిటల్‌లో చేరితే సక్రమంగా ఆపరేషన్ చేయకుండా ఆరోగ్యశ్రీ వర్తించలేదంటూ అతడి వద్ద నుంచి రూ.1.5లక్షలు కాజేశాడన్నారు. మళ్లీ ఆరోగ్యశ్రీ కింద రూ.60వేలు ప్రభుత్వానికి దరఖాస్తు చేశాడన్నారు. చివరకు ఆపరేషన్ ఫెయిలైందని చెప్పి కాలు తీసేయాలని చెబితే వారు తన వద్దకు వచ్చారన్నారు. వారికి ఆరోగ్యశ్రీ కిందనే ఆపరేషన్ చేసి వ్యాధిని నయంచేసి పంపించామని డాక్టర్ గోపిరెడ్డి వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన డబ్బులతో పాటు ఆరోగ్యశ్రీ ద్వారా అరవిందబాబుకు ప్రభుత్వం రూ.16.50కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం పొందుతూ జగన్‌మోహన్‌రెడ్డి సైకో అంటూ తన హాస్పిటల్ ఎదురు ఫ్లెక్సీలు పెట్టించిన నీచమైన వ్యక్తి అరవిందబాబని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో కోడెల శివప్రసాదరావు తన హాస్పిటల్‌కు రెండేళ్లపాటు ఆరోగ్యశ్రీ గుర్తింపును రద్దు చేయించాడని గుర్తుచేశారు. ఇప్పుడు తాము తల్చుకుంటే అరవిందబాబుకు ఆ పనిచేయగలమని అయితే తమ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అటువంటి పనులకు పాల్పడట్లేదన్నారు. మందులు పట్టుకొని శ్రీధర్‌రెడ్డి అరెస్టులో వైఎస్సార్ సీపీ చెందిన వ్యక్తులకు సంబంధం ఉంటే ఆధారాలతో సహా నిరూపించాలని టీడీపీ వారికి గోపిరెడ్డి సవాల్ విసిరారు.

ఇంటర్‌లో ఎస్ఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ ఎయిడెడ్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫలితాలలో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, ఇన్‌చార్జి డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో వారు మాట్లాడారు. తమ విద్యార్థులు సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో డి.పవన్‌కుమార్ రెడ్డి 972 మార్కులు, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో జె.అశ్వనీ 470 మార్కులకు గాను 448, బైపీసీ విభాగంలో జె.అక్షయపురుషోత్తం 440 మార్కులకు గాను 424 మార్కులు సాధించారని చెప్పారు. అలాగే జి.మోహిత, మనోజ్ఞ, పవన్ 400కు పైబడి మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త అభినందించారు.

సురక్షిత గ్రామానికి ప్రజల భాగస్వామ్యం అవసరం



మర్రిపాలెం అంగన్‌వాడీకేంద్రంలో అవగాహనకల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

యడ్లపాడు: మండలంలోని ఉన్నవ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్షిత గ్రామ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మైఛాయిస్ ఫౌండేషన్ సహకారంతో ల్యాంప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో బాల్యవివాహల నిర్మూలన, మానవ అక్రమ రవాణా, గృహహింస వంటి అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ల్యాంప్ సంస్థ ప్రతినిధి కొండపల్లి వెంకటేశ్వరావు పాల్గొని పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మానవ అక్రమా రవాణా, గృహహింస జరిగినప్పుడు సత్వరమే 100, 1098, లేదా 18004198588 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందిచాలని సూచించారు. హెచ్ఎం జి.అజరయ్య మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి లింగవివక్షత లేకుండా క్రమశిక్షణ, గౌరవభావం కలిగి ఉండాలన్నారు. సమాజం పట్ల సరైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రోగ్రాం ట్రైనర్ షేక్ బాజి మాట్లాడుతూ కుటుంబంలో తల్లిదండ్రులు బాధ్యత కలిగి ఉంటే వారి పిల్లలు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. విద్యార్థులకు కామిక్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఇదే పంచాయతీలోని మర్రిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోనూ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త దీవెనమ్మ పాల్గొన్నారు.

రాజకీయ ఉద్దేశాలతో ఆరోపణలు తగదు

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, అధికారులు

చిలకలూరిపేట: రాజకీయ దురుద్దేశాలతో ఆరోపణలకు పాల్పడటం విచారకరమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పేర్కొన్నారు. పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లోని సాయి కార్తీక్ సిటీ సెంటర్ కాంప్లెక్స్ వ్యవహారంలో మీడియా, సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలపై శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓ మోస్తరు వర్షాలు కురిసిన ప్రతిసారి సంజీవనగర్ పరిసర ప్రాంతాలు నీట మునుగుతున్న విషయం పట్టణ ప్రజలందరికీ తెలుసన్నారు. దీనికి ప్రధాన కారణం జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రధాన డ్రైన్ ద్వారా వర్షపు నీరు, మురుగునీరు ప్రవహించటానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని వెల్లడించారు. సాయి కార్తీక్ సిటీ సెంటర్ కాంప్లెక్స్ ముందు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న పైపులైన్ ప్రధాన అడ్డంకిగా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. దీనికి వక్రబాష్యాలు చెప్పడం సరికాదన్నారు. కాంప్లెక్స్ యాజమాన్యానికి పురపాలక సంఘం నుంచి నోటీసులు జారీ చేసి, యాజమాన్య ప్రతినిధుల సమక్షంలోనే పైపులైను తొలగించినట్లు చెప్పారు. అయితే కాంప్లెక్స్‌లోకి వెళ్లేందుకు అవసరమైన మేర మినహాయింపు ఇచ్చి మాత్రమే తొలగించామన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన రెండు వైపులా డ్రైన్లు నిర్మించాల్సిన బాధ్యత జాతీయ రహదారుల సంస్థకు సంబంధించిందని వెల్లడించారు. ఇదే విషయాన్ని ఇప్పటికే జాతీయ రహదారుల అధికారులకు లేఖ రాసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇటీవల జాతీయ రహదారుల అధికారులు వచ్చి సిటీ సెంటర్ సమీపంలో డ్రెయిన్ పరిశీలించి వెళ్లినట్లు వివరించారు. ఎన్‌హెచ్ఏఐ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, ఏఈఈ శ్రీనివాసరావు, టీపీఎస్ కె.సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దు భూ వివాదం పరిష్కారం

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు సచివాలయ పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దు భూ వివాదాన్ని తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ, ఫారెస్ట్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో రెండు శాఖల మధ్య భూమి విషయంలో సరిహద్దు వివాదం తలెత్తింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించామని, సర్వే చేపట్టి భూవివాదాన్ని పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. అదే విధంగా మండలంలో 1208 మంది లబ్ధిదారులను గుర్తించి వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం కోసం స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. గృహనిర్మాణ శాఖ సూచనల మేరకు లబ్ధిదారులందరికీ పొజిషన్ సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు.

వావిలాల వర్ధంతిని విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మభూషణ్, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాల కృష్ణయ్య 20వ వర్ధంతి సభ పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు జరుగు తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లం చర్ల లక్ష్మీ తులసి, విజయనగరం సామా జికవేత్త పారి నాయుడు, వావిలాల సంస్థ కార్యదర్శి మన్నవ సోడేకర్ హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, వావిలాల అభిమానులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహిస్తారని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. మండలంలోని సాతులూరు, చందవరం, గొరిజవోలు, డెయిరీ ఇండస్ట్రీ, పెయింట్ గోడౌన్స్, నరసరావుపేట రూరల్ పరిధిలోని దొండపాడు, పానుగుపాడు గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నరసరావుపేట: పట్టణంలోని 12వ వార్డులో శనివారం సాయంత్రం 5గంటలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. దీనిలో అన్నీ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారిస్తామని వెల్లడించారు.

ప్రధానిపై ఆరోపణలు అర్థరహితం

నరసరావుపేట: దేశ ప్రధాని నరేంద్రమోదీపై వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీపై బొల్లా చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే బొల్లాపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడు రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించేందుకు ఆదివారం కూడా కౌంటర్లు

వినుకొండ(నూజెండ్ల): పన్నులు వసూలుకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు 30వ తేదీ లోగా ఏకమొత్తంలో చెల్లించినట్లయితే 5 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించినట్లు చెప్పారు. చివరి రోజు ఆదివారం సెలవు అయినప్పటికీ పట్టణ ప్రజల సౌకర్యార్థం కార్యాలయ ఆవరణలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ తనిఖీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న స్టేట్ డైరెక్టర్ డాక్టర్ అయూబ్ హుసేన్

నరసరావుపేట: పట్టణంలోని ఏపీ స్టేట్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏపీ స్టేట్ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ అయూబ్ హుసేన్ శుక్రవారం సందర్శించారు. ఆలైబ్రరీలో ఎన్ని బుక్స్ ఉన్నాయి, ఎన్ని అవసరం అవుతున్నాయి, లైబ్రరీ కమిటీ ఏర్పాటు చేశారా లేదా తదితర అంశాలను పరిశీలించారు. కంప్యూటర్ సెంటర్లలో ఎంత మంది విద్యార్థులు గతంలో శిక్షణ పొందారో తెలుసుకున్నారు. ఈ సెంటర్లకు బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలను వారు నిర్వాహకులకు సూచించారు.

పెంకుటిల్లు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని మద్ది మల్లయ్య వీధిలో అగ్నిప్రమాదం సంభవించింది. రామకృష్ణకు చెందిన పెంకుటిల్లు నుంచి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంటితో పాటు గృహోపకరణ వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన ఆస్తినష్టం వాటిల్లినట్లు చిలకలూరిపేట అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి ఎస్.భాస్కర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్లు ఎస్.వెంకయ్య, రాము, సుబ్బారావు, పవన్, రామకృష్ణ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

నాదెండ్ల: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నాదెండ్ల మండలం చందవరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, యువతను పలకరిస్తూ ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని సాగించారు. గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో కనీవినీ రీతిలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి అమలు చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందన్నారు. గతంలో పింఛను రావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి ఉసూరుమన్న ఎందరో బాధితులకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో తలుపుతట్టి వలంటీర్ల ద్వారా పింఛను అందిస్తూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మూడేళ్ల పాలనలో 5 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి యువతకు వెన్నుదన్నుగా నిలిచామన్నారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి 151 సీట్లు అందించిన ప్రజలు, ఈదఫా ఎన్నికల్లో ఫుల్ మెజార్టీ 175 సీట్లు వచ్చేలా దీవించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో నాయకులు చేరెడ్డి అంజిరెడ్డి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్ మానుకొండ వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, గణపవరం, నాదెండ్ల సొసైటీల చైర్మన్లు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, విడదల గోపీ, గణపవరం, నాదెండ్ల మాజీ సొసైటీ అధ్యక్షులు కాట్రు రమేష్, సింగారెడ్డి కోటిరెడ్డి, మల్లెల రాజేష్‌నాయుడు, బైరా కృష్ణ, చేరెడ్డి వెంకటరెడ్డి, అనంతరామిరెడ్డి, గొంటు అర్జున్‌రెడ్డి, రాఘవరెడ్డి, అప్పిరెడ్డి, చేరెడ్డి అంకిరెడ్డి, రామిరెడ్డి, నారాయణరెడ్డి, గొంటు హనిమిరెడ్డి, గొంటు రామిరెడ్డి, మేకతోటి హనుమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- 32వ వార్డు బరంపేటలో జగనన్నే మా భవిష్యత్



32వ వార్డు బరంపేటలో ఓ కుటుంబానికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 32వ వార్డు బరంపేటలో జగనన్నే మా భవిష్యత్.. నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి ఏమేమి పథకాలు అందుతున్నాయో తెలుసుకొని ప్రభుత్వంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వారికి కరపత్రాలు అందించి వారి అనుమతితో ఇళ్లకు స్టిక్కర్లను అంటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 85 వేల కుటుంబాలను పలుకరిస్తామని,. ఇప్పటి వరకు 87శాతం కుటుంబాలను కలుసుకున్నామని చెప్పారు. చంద్రబాబు, లోకేష్‌లు సీఎం జగన్ మోసం చేశాడని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, వార్డు ఇన్‌చార్జి షేక్ నాగుల్‌మీరా, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముడియం శేషమ్మ, పుల్లంశెట్టి శ్రీనివాసరావు, కోటిరెడ్డి, వజీర్, హాలీవుడ్ రఘు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థినులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న సర్పంచి లక్ష్మి తదితరులు

నాదెండ్ల: ఇంటర్ ఫలితాల్లో చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటం గర్వకారణమని సర్పంచి సింగారెడ్డి లక్ష్మి చెప్పారు. ఎంపీసీ గ్రూపులో అఖిల 470 మార్కులకు గాను 458 మార్కులు సాధించి పల్నాడు జిల్లా ఏపీ మోడల్ పాఠశాలల పరిధిలో రెండో స్థానంలో నిలిచింది. సీఈసీలో వై.విజయ 500లకు గాను 426, బైసీపీలో బి.పాదిలమ 440లకు గాను 520 మార్కులు సాధించారు. బైపీసీలో జి.శైలజ 950, సీఈసీలో బ్యూలా 907, ఎంపీసీలో ఉజ్మా 851 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినులను అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో గణపవరం సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, నాదెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షుడు సింగారెడ్డి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.